# ఎడారి చూపులు

రజనీగంధ మోహపు తలపులని తట్టి లేపుతుంటే చేతిలోని మెనూ వైపు అసహనంగా చూస్తూ 'యేం కావాలి' అడిగాడు అరవింద్.

'సూప్' మెనూని యేమాత్రం పట్టించు కోకుండా చాప్‌స్టిక్స్‌ని అటూ యిటూ వూపుతూ చెప్పింది సుపర్ణారాయ్.

' యే సూప్ '

'వెజ్ క్లియర్ బేంబూఘాట్'

అరవింద్ ఆర్డర్ చేసేసి చిన్నిగా నవ్వి 'పదాలని వాక్యాలుగా చేయటం యింకా మానలేదన్నమాట' అన్నాడు.

'అలవాటు కాదు కదా మానుకోటానికి'

'అలవాట్లా? యేమో'

'యిక్కడ నీకెలా వుంది'

'ఎక్స్‌క్యూజ్‌మీ! చాప్‌స్టిక్స్ వాడతారా?' అడుగుతున్నాడు స్టీవర్డ్.

'రాదు' అందామె.

'నో, వాడం' చెప్పాడు.

స్టీవర్డ్ టేబిల్ మీద వుంచిన స్టిక్స్‌ని తీసుకొని వెళ్ళిపోయాడు.

'చైనీస్ రెస్టారెంట్స్‌లో తినడమంటే వొకప్పుడు పాములు కప్పలు గుర్తొచ్చి యేమిటోలా అనిపించేది. యిప్పుడీ ఫుడ్ అంటే భలే యిష్టం' అన్నాడు.

'ఫైవ్‌స్టార్ హోటల్లో చైనీస్ రెస్టారెంట్, పాప్‌మ్యూజిక్, రజనీగంధ' - అంటూ ఆగి చిన్నగా నవ్వుతూ 'యింటర్‌నేషనల్ యింటిగ్రేషన్' అంది.

'నీకీ పూలంటే యిష్టం కదా యెక్కడ కనిపించినా తెచ్చి నీకే యిచ్చేవాడిని' అన్నాడు.

'వూ' అందామె.

'నీకెలా వుంది యిక్కడ'

'అలసటగా'

ఆమె వైపు చిత్రంగా చూస్తూ 'అప్పుడే! నీకెందుకలా అనిపిస్తుంది'.

'పని చెయ్యాలని వుంటుంది. యెవరికీ పనిపై ఆసక్తి లేదు. సమస్యకి మూలాలు వెతకరు. తెలిసినా పట్టించుకోరు' అంది.

'హా! సుపర్ణా నీ వాదనేం మారలేదు. నువ్వు అనుకున్నంత మెకానికల్‌గా యెవ్వరూ పని చేయటం లేదు. బడ్జెట్‌లో అనేక పథకాలని యిచ్చిన డబ్బుని

ఫూర్తిగా ఖర్చు చేస్తూనే వున్నారు'

'తెలుసు! డబ్బు లేదని కాదు. ఖర్చు చేయటం లేదని కాదు. కానీ యెలా ఖర్చు చేస్తున్నారు? దేనికోసం ఖర్చు చేస్తున్నారు. పాలసీస్, డ్రాఫ్ట్స్, యింప్లిమెంటేషన్ అంతా నెంబర్లమయం మూలాలు అక్కర్లేదు' అంది.

'యేదీ వొక్కరోజులో మారదు కదా సుపర్ణా! ఆకలిరాజ్యం అని వో సినిమా వచ్చింది. టి.వి.లో చూశాం. గుర్తుందా? అలాంటి ఫ్రస్టేషన్ యీ రోజు లేదు. యెంత చదివినా సరే వుద్యోగం రావాలి అని యెదురు చూడకుండా యేదో వొక లోన్ తీసుకుని యేదో వొక వ్యాపారం చేసుకుంటున్నారు. బోల్డంత మార్పు వచ్చింది. పర్చేజింగ్ పవర్ పెరిగింది' అన్నాడు.

'యస్! పర్చేజింగ్ పవర్ పెరిగింది. రేపు నీ మీటింగ్/వుపన్యాసం యిచ్చి వెళ్ళిపోతావా?'

'మీటింగ్ అయ్యాక యిక్కడికే వచ్చేస్తా. ఎలక్షన్స్ కదా నాలుగు రోజులు యిక్కడే. యెలావుంది యీ రోజు వుపన్యాసం'

రజనీగంధ పూలని చేతుల్లోకి తీసుకొని చూపుడు వేలితో మృదువుగా స్పృశిస్తూ 'నీ వుపన్యాసం కొత్తేముంది. అప్పట్లో స్టూడెంట్స్ యిన్స్పెయిర్ అయి నీ వెంట వుద్యమాలలోకి వచ్చేవారు. యిప్పుడు వోటు బ్యాంక్ నిండుతుంది. అంతే. నా యిన్స్పిరేషన్ నువ్వేగా'

'నువ్వేమో నన్ను కోప్పడి జీవితంలోంచే వెళ్ళిపోయావు'

'కోప్పడ్డానా'

'కాదా'

'లేదు అరవింద్! నీ స్వప్నాలు ఆశలు వుద్వేగాలు అన్నీ పవర్వైపు మళ్ళటం మొదలయినప్పుడు నీకు చెప్పాను. నువ్వు వినలేదు తర్వాతర్వాత యేమయింది నువ్వే పవర్. పవరే నువ్వు అయ్యారు. పవర్ మనలని మనలిగా నిలపదని అనిపిస్తుంది' లంది.

'అఫీషియల్ లైఫ్ పట్ల అభ్యంతరాలుంటే పోని ఆ జీవితానికి దూరంగా వుండొచ్చు. కాని పర్సనల్ లైఫ్ యేం చేసింది? పెళ్ళి చేసుకుందాం అంటే వద్దన్నావుగా'

'అఫీషియల్ లైఫ్ పర్సనల్ లైఫ్ అంటూ విడివిడిగా వుండవ్. మనం రెండు జీవితాలలోనూ విడివిడిగా వుండం. మనం యెవరితో ఐడెంటి ఫై అవుతున్నాం

అన్నది చాలా ముఖ్యం కదా. పవర్ మానియాక్‌ని భరించలేను అది యే లైఫ్‌లో వున్నా కూడా. మరో అమ్మాయికి ఆ పవరే నచ్చొచ్చు. నాకు సరిపడదు అంతే' అంది.

'నన్ను కాదని వెళ్ళిపోయి పోనీ నువ్వేం సాధించావ్? నువ్వూ విశాల్ డైవోర్స్ తీసుకున్నారంట కదా. అతనితో యేమయింది' కుతూహలంగా అడిగాడు.

'విశాల్ మరో అమ్మాయిని ప్రేమించానన్నాడు. నా దగ్గర దాచాడు. ఆ అఫైర్ నాకు తెలిసింది. ఆ అమ్మాయి వుంటుందీ నువ్వూ వుండు అన్నాడు. ఆ అమ్మాయి వున్నా లేకపోయినా నేనతనితో వుండదల్చుకోలేదు. ప్రేమలో కన్సిస్టెన్సీ లేని సంబంధాలని భరించలేను. యింక నేనేం సాధించానా? తెలియదు. కాకపోతే నేనమ్ముతున్న ప్రిన్స్‌పుల్స్‌తోనే బ్రతుకుతున్నాననే తృప్తివుంది' అంది.

'మేం మా ప్రిన్స్‌పుల్స్‌తో బ్రతకట్లేదా' బిట్టర్‌గా అడిగాడు.

'మీకే తెలియాలి' చిన్నగా నవ్వుతూ అంది.

'వుపన్యాసంలో తేడా లేనట్టే నా ప్రిన్స్‌పుల్స్‌లో కూడా తేడా లేదు' అన్నాడు.

'అదేమో కాని అప్పట్లో సభకి వచ్చినవాళ్ళతో మాట్లాడేవాడివి. యిప్పుడు నీ దారి నీదే'

'యిప్పటికీ ప్రజలతో మాట్లాడాలనే వుంటుంది కానీ సెక్యూరిటీ ప్రాబ్లెమ్'

'సెక్యూరిటీ?! అప్పటి కంటే యిప్పుడు ప్రమాదంలో వున్నావా' కుతూహలంగా అడిగింది.

'రేపు మీటింగ్‌కి వస్తావా'

'వూ వస్తా. వెళదామా మరీ లేట్ అయితే నాకూతురు నిద్రపోతుంది'

'పేరు'

'ఆశ'

* * *

వెచ్చదనం కరిగి పోతున్న వేళ రగ్గులు - కంబళ్ళు - స్వెటర్లు - శాలువాలు యెటు చూసినా జనం...

ఆ వేళలో కూడా అంత మంది మీటింగ్‌కి రావటం అరవింద్‌కి బోల్డంత వుత్సాహంగా అనిపించింది.

'ప్రజలారా! నా ప్రియమైన ప్రజలారా... యేం కావాలన్నా యిస్తాం. పార్టీని గెలిపించండి. మీ జీవితాలని మెచ్చపరుస్తాం... మెజారిటీని సంపాదించి పెట్టండి... డబ్బు, రేషన్, వైద్యం...విద్య అన్నీ యిస్తాం...' అరవింద్ వుపన్యాసం సాగుతోంది.

'విద్యా...వైద్యం...యిల్లు...రేషన్... అంతా బాగా చదువుకొని ఆరోగ్యంగా వుండి కడుపు నిండా తిండి తిని మంచి యిళ్ళల్లో వుంటే మీ ప్రభుత్వాలకి నష్టం అన్నింట్లో వేళ్ళు ముంచి జస్ట్ అలా విదిలించండి. అప్పుడు మీ ప్రభుత్వం సేఫ్' యెవరో కుర్రాడు నిజాలని అరిచేస్తున్నాడు.

కలకలం... అరవింద్ భద్రతా వలయాన్ని చీల్చుకుంటూ ప్రజల్లోకి వచ్చేస్తున్నాడు. పలకరిస్తున్నాడు. మాట్లాడుతున్నాడు. సుపర్ణ అతని వైపు వెళ్ళింది ఆకలి.. అనారోగ్యం... లోను... పింఛను... యిల్లు... వృద్ధాప్యం... సమస్యలు... సమస్యలు.

యిరవై ఆరేళ్ళ యువతి వో యేడాది బిడ్డని యెత్తుకొని. పక్కనే వో పధ్నాలుగేళ్ళ పాప. యెవరి వొంటిమీద సరియైన బట్టలు లేవు. అంత చలిలో మీటింగ్‌కి వచ్చారు. యే వెచ్చని బట్టలు కప్పుకోకుండా.

'పాపా... బాబా...' అడిగాడు అరవింద్.

'పాప'

'యీ బిడ్డ' పక్కనున్న పాపని చూసి అడిగాడు.

'నా బిడ్డే'

'యేం చేస్తున్నావ్ పాపా! బడికి వెళుతున్నావా' అడిగాడు అరవింద్.

'బిడ్డా?!... లేదు బాబు వుదయమే బిడ్డని కన్నది. పుట్టిన వెంటనే బిడ్డ పోయింది' చెప్పింది తల్లి.

'యీ వుదయం... యీ పాపకి...'

'హా..బాబు'

'మీరేం చేస్తుంటారు'

'వొళ్ళు అమ్ముకుంటాం బాబూ'

'అవునా!'

'అవును బాబు' అంది తల్లి.

'యీ పాప కూడా'

'అవును బాబు' అంది తల్లి.

'యీ పాప కూడా'

'అవును బాబు'

ఆ తల్లీ కూతుళ్ళ వైపు నుంచి బాధగా తిప్పుకుంటున్న అతని చూపులు సుపర్ణ చూపులతో కలిశాయి.

యస్ సుపర్ణా! మనం దొంగలం. ముసుగులేసుకున్న దొంగలం. యెన్నెన్ని వుద్యోగాలతో వుద్యమాలు నడిపాం. మనలాంటి వాళ్ళు రాజకీయాల్లోకి రాకే అసెంబ్లీలు పార్లమెంట్ హాల్స్ కుళ్ళు రాజకీయాలతో కంపుకొడుతున్నాయని యిందులోకి వచ్చాం. యేం సాధించాం? సెక్యూరిటీ పవర్ వోట్‌బ్యాంక్ అరే సుపర్ణా... ఆ తల్లికి యిరవై ఆరో యిరవై యేడో... ఆమెకి యేడాది బిడ్డ. ఆ పధ్నాలుగేళ్ళ పాప ఆమె కూతురేనంట. ఆ పాపకి వుదయం బిడ్డ పుట్టి పోయిందంట. వాళ్లిద్దరూ మీటింగ్‌కి వచ్చారు. యెందుకంటావ్ మా పార్టీ వాళ్ళు డబ్బులిచ్చి తెచ్చారా మనుష్యుల్ని? లేక మేం యేమైనా వుద్ధరిస్తామని నమ్మి వచ్చారా? యెందుకొచ్చారంటావ్? వాళ్ళిద్దరూ సెక్స్ వర్కర్సంట. స్త్రీలు పూజ్యనీయులంటూ గౌరవనీయులంటూ చాలా వుపన్యాసాలు చెపుతాం. అయినా వీళ్ళ కోసం చాలా డబ్బు ఖర్చు చేస్తున్నారే... నో... యిలా యెలా అయిందో. ఆ రోజుల్లో యెంత ఆవేశం... వుద్రేకం... వాటితో మొదలైన జీవితం... యేం సాధించాం? తాగటానికి యెలాను నీళ్ళు యివ్వలేకపోయాం. కనీసం కన్నీళ్ళని మిగల్చలేక పోయామా? నువ్వు చూసావా సుపర్ణా! వాళ్ళ కళ్ళలో నీళ్ళు లేవు యెడారి కళ్ళు...

సుపర్ణ అతని వైపే అలానే చూస్తుంది.

'రేపు యీ విషయాన్ని బహిరంగంగా వేదిక మీద చెప్పేస్తాను. ముసుగు లేకుండా మాట్లాడతాను. పార్టీ యేమైనా అననీ. పార్టీలోంచి పంపించేసినా పర్లేదు. ప్రజలతో పని చేయాలి. యిట్స్ వెరీ యింపార్టెంట్. మనం కలిసి పని చేద్దామా'

సుపర్ణ శాలువ భుజాల చుట్టూ కప్పుకుంటూ 'వెళతా' అంది.

వాజ్‌లోంచి పూలు తీసి ఆమెకి యిచ్చాడు.

వాటివైపే చూస్తూ అందుకోకుండా 'రేపు కలుస్తా' అంది.

'మీటింగ్‌కి రా'

'వూ'

* * *

మైదానమంతా అప్పుడప్పుడే పరచుకుంటున్న వెచ్చదనం.

వేదికకి వో పక్కన ప్రజల మధ్యన కూర్చుని వుంది సుపర్ణ.

అరవింద్ వుపన్యాసం యెప్పుడు మొదలవుతుందాని ఆత్రంగా చూస్తుందామె. యెటు చూసినా అతని పార్టీ జెండాలు. కార్యకర్తలు హడావుడిగా చప్పట్లు... యీలలు... సుపర్ణ వేదిక వైపు చూసింది.

అరవింద్ మైక్ ముందుకి వస్తున్నాడు.

'ప్రజలారా నా ప్రియమైన ప్రజలారా! యెన్నెన్నో వుద్వేగాలతో ఆశలతో మా రాజకీయ జీవితం ఆరంభం అయింది.

సుపర్ణ కళ్ళల్లో వెలుగు. ఆమె వూపిరి వేగం పెరిగింది.

'మీకోసం సమస్తమూ యిస్తాం. డబ్బు యిస్తాం రేషన్ యిస్తాం సమస్తాన్ని యిస్తాం... మాకు మెజారిటీని సంపాదించి పెట్టండి...

సుపర్ణ మెల్లగా అక్కడ నుంచి బయటకి వచ్చింది.

యింట్లోకి అడుగుపెడుతుంటే యెదురుగా పుష్పగుచ్ఛం.

'యెక్కడివి' అడిగింది.

'నువ్వు అటు వెళ్ళావ్ అని పట్టుకొచ్చి యిచ్చాడో కుర్రాడు' చెప్పింది ఆయమ్మ.

'వూ'

కాసేపు అలానే కూర్చుండిపోయింది.

ఫోన్ మోగుతుంది

'హలో'

'సుపర్ణా! నేను... వెళ్ళిపోయావా? యేమైందో యేమిటో... అసలెలా అలా మాట్లాడేనో. బాధగా వుంది. నువ్వురా మాట్లాడుకుందాం...

'నో రిగ్రెట్స్. నువ్వు యేదో అనుకుని బయలుదేరావ్. యెక్కడో తేలావ్ న్యాయమో అన్యాయమో... నీతి... నిజాయితీ యేదో వొకటి. యేదైనా కానీ నువ్వు వో పార్టీని నమ్మావు. కంటిన్యూ యిన్ యిట్. మనం మాత్రం

మాట్లాడుకోవద్దు. నాతో మాట్లాడిన దగ్గర నుంచి తప్పు చేస్తున్న ఫీలింగ్ నీకు. సందిగ్ధాలు మనలని యెంతగా అశాంతికి లోను చేస్తాయో నాకు తెలుసు.

'నువ్వొక్కసారి రావొచ్చుగా'

'నువ్వున్న స్టేచర్‌కి నిజానికి తిరిగి నువ్విలా నాతో మాట్లాడాలనుకోవటం, చూడాలనుకోవటం ఆశ్చర్యంగానే వుంది. అంటే యింకా నీలో యెక్కడో పూర్వ పరిమళం వుంది. అరవింద్! మన ఆవేశాలు వుద్వేగాలు కలలు ఆశలు యీ పూలకి తెలుసు. కనీసం ఆ అస్తిత్వాన్నైనా కాపాడుకుందాం. నువ్వు పంపించిన పువ్వుల్ని తిప్పి పంపించేస్తున్నా'

'సుపర్ణా!'

'బై' ఆమె చూపులన్నీ యెర్రమట్టి పాత్రలో వున్న యెండిన రంగుల పూల మీద.

♦